క్లుప్తంగా

అడవుల సంరక్షణ ప్రధాన బాధ్యత



శిక్షణలో మాట్లాడుతున్న ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ విజయ్ కుమార్

రాజానగరం: అడవులు, వాటిలో ఉండే వన్య ప్రాణులను సంరక్షించడం అటవీ శాఖ ఉద్యోగుల ప్రధాన బాధ్యతని, అందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ఉద్దేశమని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ బి.విజయ్ కుమార్ అన్నారు. దివాన్ చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీలో 13వ బ్యాచ్ ఫారెస్టు బీట్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరు నెలల కాల వ్యవధితో కూడిన ఈ శిక్షణలో 22 విభాగాలలోని 38 మంది ఎఫ్‌బీఓలు పాల్గొంటున్నారు. కోర్సు డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరెడ్డి కోర్సు వివరాలను తెలియజేశారు.

పీ4 పథకంపై అవగాహన సమావేశం

పెదపూడి: సమాజంలో అట్టడుగు ప్రజల అభివృద్ధి, వారికి చేయూత అందించడానికి పీ4 బంగారు కుటుంబం మార్గదర్శి పథకం దోహదపడుతుందని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడి పంచాయతీ వద్ద బుధవారం పీ4 బంగారు కుటుంబం మార్గదర్శి పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి పథకాలు పొందలేని నిరుపేదలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ కలవల కష్ణమూర్తి, కాశీ విశ్వనాథ చౌదరి, డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న కిశోర్ బాబు తదితరులు

సీతానగరం: మునికూడలి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల–1 లోని ఐదో తరగతి విద్యార్థులకు బుధవారం నవోదయ మెటీరియల్‌ను అందజేశారు. రఘుదేవపురానికి చెందిన రైల్వే లోకో పైలట్ కిశోర్ బాబు, సునీత దంపతుల కుమార్తె, కుమారుడు దిల్కీ, భీమ్‌ల పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్.నాగమణి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర్ బాబు మాట్లాడుతూ నైతికతతో కూడిన విద్యతోనే విజ్ఞత, వినయం, సేవాగుణం అలవడతాయన్నారు. ఈ మెటీరియల్ సహాయంతో విద్యార్థులు నవోదయ పాఠశాలల్లో ప్రవేశం పొంది ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

ఆటో బోల్తా



పొలంలోకి బోల్తా పడిన ఆటో

సీతానగరం: సీతానగరం – పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డులో సింగవరం నాగరత్నం కాలనీ దగ్గర బుధవారం ఆటో అదుపు తప్పి ఏటిగట్టుపై నుంచి పొలాల్లోకి బోల్తా కొట్టింది. ఆ సమయంలో దానిలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు, అతడికి స్వల్ప గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. ఆ బోల్తా పడిన ఆటోను డ్రైవర్ మళ్లీ ఏటిగట్టు ఎక్కించి, వంగలపూడి వైపు వెళ్లినట్టు వివరించారు.

ఘనంగా అభిషేకాలు

సీతానగరం: స్థానిక శివాలయంలోని ఉమా రామలింగేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం, ఆరుద్ర నక్షత్రం, మాసశివరాత్రి సందర్భంగా అర్చకుడు కొడమంచిలి రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. గ్రామస్తుల సహకారంతో అమ్మవారిని కూరగాయాలతో శాకంబరి దేవిగా అలంకరించారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బిక్కవోలు: పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దామని పందలపాకలోని పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాస రెడ్డి అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి సారథ్యంలో విద్యార్థులతో బుధవారం సామూహిక పొగా కు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం దూదిమిల్లు వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి, ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు చేశారు.

దేశ సేవకు సిద్ధంగా ఉండాలి

రాజానగరం: అత్యవసర పరిస్థితులలో దేశానికి సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ సర్వ సన్నద్ధంగా ఉండాలని 18వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో రాజమండ్రి క్లస్టర్ పరిధిలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు బుధవారం ఆపరేషన్ సిందూర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రాత్రయితే అంధకారం

- విమానాశ్రయం రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు
- వాహన చోదకుల అవస్థలు

కోరుకొండ: జాతీయ రహదారి 516ఈ అని పిలిచే విమానాశ్రయం రహదారి పాలకుల నిర్లక్ష్యంతో సమస్యలకు నిలయంగా మారింది. ప్రశాంతమైన పల్లెల మీదుగా సాగే ఈ రోడ్డు రాత్రి వేళల్లో అంధకారమవుతోంది. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ మండలం బూరుగుపూడి వరకూ గల రహదారి నిశీధిగా ఉంది. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి సమయంలో రోడ్డుపై పాములు సంచరిస్తున్నాయి.

వెలగని వీధి లైట్లు

రాజమహేంద్రవరం నుంచి బూరుగుపూడి వరకూ 12 కిలోమీటర్ల మేర 640 ఇనుప స్తంభాల ద్వారా విద్యుత్ సరఫరా జరగడానికి లైన్ వేశారు. అయితే రోడ్డు మధ్యలోని డివైడర్‌లో ఏర్పాటు చేసిన స్తంభాల లైట్లు వెలగడం లేదు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)కు చెందిన ఎలక్ట్రిసిటీ విభాగం వీటిని నిర్వహిస్తోంది. అయితే కొంత కాలంగా ఇక్కడ లైట్లు వెలగకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విద్యుత్ సరఫరా బంద్

ఎయిర్‌పోర్టు రహదారిలో విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదు. రుడా నిర్వహణ లోపంతో సమస్య ఏర్పడుతోంది. రాజమహేంద్రవరం నుంచి బూరుగుపూడి చీకటిమయంగా మారుతోంది. రాజమహేంద్రవరం మండలం చెంచు కాలనీ, సంతోష్ నగర్, కొంతమూరు కాలనీ, కోలమూరు గాడాల కాలనీ, గాడాల, మధురపూడి, బూరుగుపూడి గ్రామాల్లో రాత్రివేళల్లో అంధకారం అలముకుంటోంది.



ఎయిర్‌పోర్టు రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు



చీకటిమయంగా మారిన ఎయిర్‌పోర్టు రోడ్డు

పలు ప్రమాదాలు

విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ఆ రహదారిలో అంధకారం అలముకుంటోంది. చీకటి కారణంగా వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంతమూరు – కోలమూరు మధ్య కాలనీకి వెళ్లే సెంటర్‌లో ఇటీవల ప్రమాదం జరిగింది. కోలమూరు సెంటర్ రోడ్డు క్రాసింగ్ వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. అలాగే గాడాల గ్రామంలోని పొన్నాలమ్మ ఆలయం వద్ద పలు ప్రమాదాలు జరిగాయి. వాటిలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గాడాల శివారు పెట్రోలు బంకు ఎదురుగా జరిగిన ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, పలువురు గాయాలపాలయ్యారు. మధురపూడి ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా దుర్గమ్మ ఆలయానికి వెళ్లే క్రాసింగ్ పాయింట్ వద్ద ప్రమాదాలు జరిగాయి. వీటిలో రాజమహేంద్రవరానికి చెందిన వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఎయిర్ పోర్టు పాత గేటు ఎదురుగా, గాడాల బ్రాందీషాపు క్రాసింగ్ పాయింట్ వద్ద కూడా యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఎయిర్ పోర్టు రహదారిలోని విద్యుత్ లైన్‌కు రుడా సంస్థ ఎలక్ట్రిసిటీ విభాగం మరమ్మతులు నిర్వహించక పోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

త్వరితగతిన చేపట్టాలి



జాతీయ రహదారిగా పిలువబడే ఎయిర్ పోర్టు రహదారిలో విద్యుత్ దీపాలు వెలిగేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలి. విద్యుత్ లైట్లు వెలగక రాత్రి సమయంలో ఈ రోడ్డులో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– కొండపల్లి దుర్గారావు, బీసీ సెల్ అధ్యక్షుడు, తూర్పుగోదారి జిల్లా

చర్యలు తీసుకోవాలి



విమానాశ్రయం రహదారిలో విద్యుత్ దీపాలను వెలిగించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ రాత్రి వేళ్లలో అంధకారం నెలకొంటోంది. అధికారులు స్పందించి, తక్షణమే చర్యలు చేపట్టాలి.

– పెనుగుల కృష్ణంరాజు, యువజన నాయకుడు, బూరుగుపూడి

అదనపు ఆదాయం పెంచేందుకు చర్యలు

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాలని కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి అన్నారు. శహపురం, కాండ్రేగుల గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. అక్కడి సంపద తయారీ కేంద్రాలు, తడి, పొడి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారు చేస్తున్న విధానం, విక్రయాల వివరాలను సచివాలయ కార్యదర్శి చంద్రలేఖను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల వద్ద బయట ఉన్న తొట్టెల్లో పెంచుతున్న ఆకు కూరల మొక్కలను పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు కేవీవీ సత్యనారాయణ, వనుం శాంత కుమారి, సచివాలయ కార్యదర్శులు విజయ శేఖర్ రెడ్డి, శ్రీనివాసు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం



సబ్బెళ్ల కృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న వ్యతిరేకతను మళ్లించడానికే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆయన రాజమహేంద్రవరంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం కేసు అనే ఒక అభూత కల్పనను అధికారులు సృష్టించి రాష్ట్ర స్థాయిలో చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వంటి నాయకులను అరెస్ట్ చేశారన్నారు. ఎంతోకాలంగా రాజమహేంద్రవరం పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని, వాటిపై ఆమరణ నిరాహార దీక్షకు దిగిన రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను హౌస్ అరెస్ట్ చేసి ఉద్యమాన్ని అణచాలని ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. అక్రమ అరెస్టులు చేసి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందని, ఏడాది కాలంగా ఎన్నికల హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకత పెరిగిందని,దాని నుంచి బయటపడడానికే ప్రభుత్వం లేనిపోని కేసులను సృష్టించి, వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తోందన్నారు.

అక్రమ అరెస్టులతో న్యాయాన్ని ఆపలేరు



కొండమీద శ్రీను

కోరుకొండ: కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులతో న్యాయాన్ని ఆపలేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొండమీద శ్రీను అన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కక్షపూరితంగా కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిందని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాజమహేంద్రవరంలోని పేపరుమిల్లు కార్మికుల సమస్యలపై పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను హౌస్ అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఎగ్గొట్టేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు.

దుర్గాభవానికి 500 కిలోల సారె



బిక్కవోలులో దుర్గాభవాని అమ్మవారికి సమర్పించిన సారె

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలోని వంతెన వద్ద కొలువైన దుర్గాభవాని అమ్మవారికి బుధవారం 500 కిలోల సారెను సమర్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలోని గ్రామంలోని మహిళలు వివిధ రకాల స్వీట్లతో పాటు పసుపు, కుంకుమ, గాజులు, అరటి పండ్లు, చీరలను అమ్మవారికి సమర్పించారు. ముందుగా వాటితో ఊరేగింపుగా గ్రామోత్సవం జరిపారు. అనంతరం అర్చకుడు బిక్కవోలు రాఘవరాం అమ్మవారి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యంగా సమర్పించారు.

కూటమి మామూళ్లకు రియల్టర్ల హడల్

- లేఅవుట్ వేయాలంటేనే భయం
- ఎమ్మెల్యేపై కూటమి నాయకుల్లోనే అసంతృప్తి
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మామూళ్ల దెబ్బకు నియోజకవర్గంలో రియల్టర్లు కొత్త లేఅవుట్లు వేయడానికి భయపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన కుటుంబానిది 55 ఏళ్ల రాజకీయ ప్రస్థానమని చెబుతున్నారని, ఆయన స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డికి వారసుడైతే కావచ్చుకాని రాజకీయాలలో మాత్రం కాదని ఆయన గౌరవం పెంచే పనులు ఏమీచేయలేదన్నారు. మూలారెడ్డికి తమకు రాజకీయ వైరం ఉన్నప్పటికి వ్యక్తిగతంగా అందరితోనూ కలసి మెలసి ఉండేవారన్నారు. ఆయన తనయుడు మాత్రం వ్యక్తిగత కక్షలతో ప్రతిపక్ష నేతలపై భౌతిక దాడులు చేయిస్తూ, గృహాలు కూల్చుతూ ధ్వంస రచన చేసి, నియోజకవర్గంలో ఎప్పుడూ లేని దుష్ట సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారన్నారు. సొంత పార్టీ నేతల నుంచి కూడా ముడుపులు తీసుకుంటున్నారని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారన్నారు. మూలారెడ్డి చివరి శ్వాస వరకు ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారని, పదవుల కోసమో మరేదో ఆశించి పార్టీలు మారలేదన్నారు. రామకృష్ణారెడ్డి మాత్రం దానికి భిన్నంగా టక్కుటమార విద్యలన్నీ ప్రదర్శించి, పదవి కోసం పార్టీ మారి, మనసు ఇక్కడ మనువు అక్కడ అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ తరహా రాజకీయాలు ఎంతో కాలం సాగవని, ఇప్పటికే కూటమిలోని మూడు పార్టీల నాయకుల్లోనూ ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి సెగలు మొదలయ్యాయన్నారు.

‘చాగల్నాడు’ నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న మంత్రి గొట్టిపాటి మురళి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలోని చాగల్నాడు ఎత్తిపోతల పథకం నుంచి నీటిని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం విడుదల చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ మొదటి దశ సాగునీటిని విడుదల చేసేందుకు గోదావరి నదికి హారతులిచ్చి, అనంతరం మోటార్ స్విచాన్ చేశారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ, చాగల్నాడు పథకం రంగంపేట, కోరుకొండ, రాజానగరం మండలాల్లో ఉన్న 6,250 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు వివరించారు. చాగల్నాడు మొదటి దశ నుంచి లీడింగ్ చానల్ ద్వారా కోలమూరులోని రెండో దశకు, అక్కడి నుంచి మరో లీడింగ్ చానల్ ద్వారా పాలచర్లలోని మూడో దశకు, అక్కడి నుంచి కాలువల ద్వారా పొలాలకు సాగు నీరు చేరుతుందని తెలిపారు. మొదటి దశలో ఒక పంపు మాత్రమే పనిచేస్తోందని, మిగిలిన వాటికి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తామన్నారు.

మహనీయుల సేవలు స్ఫూర్తిదాయకం



నన్నయలో తిలక్, ఆజాద్‌ల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం



మెల్లూరు పాఠశాలలో స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని బుధవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుల చిత్రపటాలకు రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం వీరు చేసిన త్యాగాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు కూడా పాల్గొన్నారు.

బిక్కవోలు: మెళ్లూరు ఉన్నత పాఠశాలలో చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర్ తిలక్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి.లక్ష్మి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం హిందూస్తాన్ రిపబ్లిక్ ఇన్ అసోసియేషన్ స్థాపించిన చంద్రశేఖర్ సహాయ నిరాకరణలో పాల్గొని అరెస్టయ్యారన్నారు. దేశానికి స్వాతంత్ర్య సాధించడం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడన్నారు. బాలగంధర్ తిలక్ భారత జాతీయోద్యమ పితగా పేరుపొందారన్నారు. వారి పోరాటాలు, ఉద్యమాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాల సుగంధాలు వెదజల్లిన అయ్యంకి

- అక్షర తపస్విగా పేరుగాంచిన వైనం
- పుట్టిన ఊరిలో గ్రంథాలయానికి ఆదరణ కరవు
- నేడు ఆయన జయంతి

బిక్కవోలు: గ్రంథాలయోద్యమ పితామహుడుగా ప్రసిద్ధికెక్కిన అయ్యంకి వెంకట రమణయ్య జన్మించిన గ్రామంలోని గ్రంథాలయం ఆదరణకు నోచుకోలేదు. కొంకుదురులో 1890 జూలై 24న ఆయన జన్మించారు. విజయవాడలో స్థిరపడిన ఆయన 1910లో గ్రంథాలయోద్యమానికి పాటు బడ్డారు. చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం, పలువురితో చదివించడం అలవాటు. నర్సాపురంలోని టైలర్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే ఆయన స్వయంగా చిన్న గ్రంథాలయాన్ని స్థాపించి పాఠకులను ఆకర్షించారు. తన 19వ ఏటనే బిపిన్ చంద్రపాల్‌ని ఆదర్శంగా తీసుకొని, ప్రజాసేవ వైపు అడుగు వేశారు. 1910లో బందరులో ఆంధ్రరాష్ట్ర సాహిత్య పత్రికను స్థాపించి గురజాడ, రాయప్రోలు, శ్రీ.శ్రీ రచనలను ప్రచురించి ప్రజలను చైతన్యవంతులు చేశారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభను విజయవాడలో నిర్వహించారు. అదే ఏడాది రాష్ట్రంలో గ్రంథాలయోద్యమాన్ని వ్యాపింపజేయడం కోసం గ్రంథాలయ సంఘాన్ని స్థాపించారు. 1919 నవంబర్ 14న చెన్నైలో తొలి అఖిల భారత పౌర గ్రంథాలయం స్థాపించి, మొదటి మహాసభను నిర్వహించారు.

గ్రంథాలయోద్యమం

1911లో విజయవాడలో రాజా రామ్మోహన గ్రంథాలయ పాలక వర్గ కార్యదర్శిగా సేవలు అందిస్తూ, 1914లో విజయవాడలో ఆంధ్ర దేశ గ్రంథ భాండాగార ప్రతినిధుల గ్రంథాలయ మహాసభలు జరిపి, భారతదేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘం ఏర్పాటు చేశారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయాన్ని స్థాపించి,1824లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరి జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. వీరు ఈ సంఘన్ని స్థాపించిన రోజున నేషనల్ లైబ్రరీ డేగా భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి దేశమంతటా 1968 నుంచి ప్రతి ఏడాది జాతీయ గ్రంథాలయ వారోత్సవం నిర్వహిస్తోంది.

పుట్టిన ఊరిలో..

దేశ వ్యాప్తంగా పేరుగాంచిన అయ్యంకి వెంకటరమణయ్య పుట్టిన ఊరులో గ్రంథాలయానికి సరైన ఆదరణ లేదు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి ఈ గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అవి కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మనవడు పడాల సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు భవనం ఏర్పాటు చేశారు. అలాగే ప్రస్తుతం ఉద్యోగి నియమించారు. కానీ డిజిటల్ గ్రంథాలయం కలగానే ఉండిపోయింది.



ఆదరణ నోచుకోని కొంకుదురు గ్రంథాలయం



అయ్యంకి వెంకట రమణయ్య (ఫైల్)

బైకుల దొంగకు ఏడు నెలల జైలు

సీతానగరం: మోటారు సైకిళ్లను దొంగతనం చేసిన కేసులో ఉండేశ్వరపురానికి చెందిన బండారు రాముకు రాజమహేంద్రవరం సెవన్త్ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏడు నెలలు జైలు విధించారని ఎస్సై డి.రామ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 డిసెంబర్‌లో ఎనిమిది మోటారు సైకిళ్ల దొంగతనానికి గురయ్యాయని, ఈ సందర్భంగా నిందితుడు రామును పట్టుకుని వాటిని రికవరీ చేశామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చడం జరిగిందన్నారు. ఏడు నెలల నుంచి రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న కారణంగా రాముకు కోర్టు విధించిన జైలు శిక్షను పరిగణనలోకి తీసుకుందన్నారు. దీనితో రాము త్వరలో జైలు నుంచి విడుదలవుతాడన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



బిక్కవోలు: రంగాపురం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతరను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, కోయ డ్యాన్సులు, శక్తి వేషాలు, తీన్‌మార్, మ్యూజికల్ నైట్ తదితర కార్యక్రమాలు జరిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనుల పరిశీలన

రంగంపేట: మండలంలోని ఏడీబి రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను జేసీ చిన్నరాముడు బుధవారం పరిశీలించారు. ఆయన ముందుగా రంగంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులపై సంబంధిత కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. అనంతరం పెదరాయవరం, రంగంపేట గ్రామాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోడ్డు పక్కనే ఉన్న చిరు వ్యాపారులతో మాట్లాడి, రోడ్డు విస్తరణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, రంగంపేట, రాజానగరం తహసీల్దార్లు అనసూయ, దేవి, డిప్యూటీ తహసీల్దార్ రంజిత్, మండల సర్వేయర్లు, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



బాస్కెట్ బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 25వ విమెన్స్ గేమ్స్ మీట్‌లో వివిధ ఆటలలో 10 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు, ఏడు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ విషయాన్ని యూనివర్సిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఈ.త్రిమూర్తి బుధవారం విలేకరులకు తెలిపారు. త్రోబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్ తదితర వాటిలో పోటీలు జరుగుతున్నాయన్నారు. గురువారం జరిగే ఫైనల్స్‌తో ఈ పోటీలు ముగుస్తాయన్నారు.

ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం మీదే



సమావేశంలో మాట్లాడుతున్న మేజర్ మహ్మద్ ఆసిఫ్

రాజానగరం: అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం మీదేనని 18వ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో బుధవారం జరిగిన కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో ఎంతో ఉన్నతమైనదన్నారు. ఆ వయసులో చేసుకునే అలవాట్లు, వ్యవహారాలు, లక్ష్యసాధన, నాయకత్వ లక్షణాలపైనే తదుపరి జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ మీ భవిష్యత్తుకు మీరే మార్గదర్శకులనే విషయాన్ని మరువరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి, విమల, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో పనిచేయాలి

పెదపూడి: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పని చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన బుధవారం జరిగింది. వ్యవసాయశాఖ మండలాధికారి సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభమైందని, రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. తహసీల్దార్ సీతాపతిరావు మాట్లాడుతూ రేషన్‌కార్డుల చేర్పులు, తొలగింపు చేస్తున్నారని, అలాగే పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి స్థల సేకరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.అనుష మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎక్స్‌రే ఎక్విప్‌మెంట్ విభాగం సిద్ధం చేశామని త్వరలో ప్రారంభించనున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.